క్లుప్తంగా

సీఐఎస్ఎఫ్ కమాండెంట్ జితేంద్రబాబు బాధ్యతల స్వీకరణ



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ నూతన కమాండెంట్‌గా జితేంద్ర బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు యూనిట్ సీనియర్ కమాండెంట్‌గా విధులు నిర్వహించిన అతహర్ మహ్మద్ హనీఫ్ భిలాయ్‌లోని సీఐఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో బాధ్యతలు స్వీకరించి న జితేంద్రబాబు ఇంత వరకు జమ్ముకశ్మీర్ లోని దుల్ హస్తి హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో కమాండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008 బ్యాచ్‌కు చెందిన జితేంద్రబాబు స్వస్థలం విశాఖనగరంలోని కంచరపాలెం.

చిన్నారులకు మేకప్ కిట్ల అందజేత



మేకప్ కిట్‌లు అందుకున్న బాల కళాకారులతో దాత

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన శ్రీకృష్ణ కోలాట బృందం చిన్నారులకు మేకప్ కిట్‌లు అందించారు. గాంధీజీవీధి వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మరిడిమాంబ అమ్మవారి పండగ జరిగింది.దీనిలో చిన్నారులు కోలాటం అద్భుతంగా ప్రదర్శించారు.చిన్నారుల నృత్యానికి ముగ్ధుడైన ఉరుకూటి శివచంద్ర శేఖర్ నృత్యం చేసిన చిన్నారులకు అవసరమైన మేకప్ కిట్లు వితరణగా అందించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్లస్–2 పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ పాఠశాలల్లో సౌకర్యా ల కల్పనకు ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. గోపాలపట్నం, మల్కాపురం ప్లస్–2 పాఠశాలల విద్యార్థులు టి. మౌనిక, ఎస్. తేజస్విని, ఎస్.ఆకర్షిక, కె.సాయిలక్ష్మి, వినయ్, ఎం. నీరజ్, బి.లహరి, కె.జ్యోత్స్న ఆయన శాలువా కప్పి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ప్రసాద్, వేణుగోపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ, డిప్లమా పారామెడికల్, నర్సింగ్, బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7995013421, 7207953919 నంబర్లలో, షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పటల్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆదేశాల మేరకు, జీఆర్పీ ఎస్ఐ కే శాంతారాం, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణ తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రాష్ట్రం పాడువకు చెందిన బసంత కుమార్ ఖరా గంజాయిని అక్రమంగా తరలిస్తుండడాన్ని గుర్తించారు. బసంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

సర్వీస్ రోడ్డా.. పార్కింగ్ జోనా?



చింతమణి దుర్గాగణపతి ఆలయం ఎదురుగా నిలిపిన ద్విచక్ర వాహనాలు, కార్లు



ఐవోసీ మార్గంలో షాపుల ముందు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

మల్కాపురం: విశాలమైన ఆ మార్గం వాహనాల అడ్డదిడ్డమైన పార్కింగ్‌తో ఇరుగ్గా మారింది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మల్కాపురం సమీపంలోని ఐవోసీ సర్వీస్ రోడ్డులో చింతామణి దుర్గాగణపతి ఆలయ సముదాయంతో పాటు ఐవోసీ బ్లాక్ ఆయిల్ టెర్మినల్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఐవోసీ టెర్మినల్ ప్లాంట్ ఎదురుగా గల హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) స్థలంలో 23 వేల కోట్ల రూపాయలతో సంస్థ విస్తరణ పనులు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ విస్తరణ పనులకు వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో కార్మికులు నిత్యం ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. పనుల కోసం వచ్చే కార్మికులకు సంస్థ పార్కింగ్ సదుపాయాన్ని కల్పించాలి. కానీ ఆ సంస్థ పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడంతో కార్మికులు సర్వీస్ రోడ్డులో తమ వాహనాలను ఇష్టానుసారం పార్క్ చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుగ్గా మారి ఆ మార్గంలో వచ్చే ఇతర వాహనాలు తప్పుకోలేని పరిస్థితి కలుగుతోంది.

ఆలయంలోకి ప్రవేశించే మార్గమేది?

ఇక్కడ గల చింతమణి దుర్గాగణపతి ఆలయ సముదాయానికి పారిశ్రామిక ప్రాంత చుట్టుపక్కల నుంచి రోజూ అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారు ఆలయంలోకి ప్రవేశించే మార్గం కూడా లేకుండా కార్మికులు దేవాలయానికి అడ్డంగా తమ వాహనాలను పెడుతున్నారు. అలాగే ఇక్కడ గల చిన్నషాపుల ముందు వాహనాలు అడ్డంగా పార్కు చేస్తున్నారు. దీంతో ఆ షాపుల వద్దకు కొనుగోలుదారులు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యపై మల్కాపురం ట్రాఫిక్ అధికారులు స్పందించాలని పలువురు వాహనదారులు, పాదచారులు, భక్తులు కోరుతున్నారు.

ఆలయంలోకి వెళ్లలేక పోతున్నాం



పూజల కోసం ఇక్కడ చింతమణి దుర్గాగణపతి ఆలయానికి వస్తుంటాం. లోపలికి వెళ్లాలంటే వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. చాలా ఇబ్బందిగా ఉంటుంది. అధికారులు చర్యలు తీసుకుని దారి కల్పించాలి. – బంక నాగేశ్వరరావుపాత్రుడు, భక్తుడు

రాకపోకలకు ఇబ్బంది



ఐవోసీ మార్గంలో చాలా ద్వి చక్ర వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్నారు. దీంతో ఆ దారిలో వెళ్లాలంటే కష్టమవుతోంది. పైగా ఈ మార్గంలో ఆయి ల్ లారీలు రావడం, ద్విచక్ర వాహనాలు అడ్డుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అధికారులు స్పందించాలి.

– సమ్మిడి అప్పలరాజు, పాదచారుడు

ఉమ్మడి పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలి



రిజిస్ట్రార్‌కు సదస్సు కరపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

విశాఖ విద్య: ఉమ్మడి పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు వినతి పత్రం అందజేశారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని నాగరాజు కోరారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఆయన అన్నారు.దేశంలో అమలవుతున్న విద్యా వ్యతిరేక విధానాలు, రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 26, 27, 28 తేదీల్లో కడప జిల్లాలో విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూ అధ్యక్షుడు నెహేమియ, కార్యదర్శి జెట్టి అభిషేక్, ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో భిక్షాటన చేసుకునే అనాథ వృద్ధుడు (70) మంగళవారం మరణించాడు. స్థానికులు కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ముందుకు వచ్చి మృతదేహానికి కాన్వెంట్ కూడలి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవర్ హ్యాండ్స్ అధ్యక్షుడు పిల్లి గోవిందరాజు, ఐతి మధుబాబు, రవికుమార్, శివ, హెడ్ కానిస్టేబుల్ వి.వెంకట్రావ్, మొబైల్ కానిస్టేబుల్ రాంబాబు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్తున్న అవర్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గోపాలపట్నం: స్థానిక శ్రీ పైడిమాంబ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం ఇక్కడి కుమారి కల్యాణ మండపంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పెద్ద పూడి త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి పి. రాజు, గౌరవ అధ్యక్షుడు సగరపు కోటేశ్వరరావు, నరవ నాగేశ్వరరావు, కోశాధికారి పి. లోవరాజు తదితర కార్యవర్గం చేత రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఆరిపాక పెంటారావు ప్రమాణ స్వీకారం చేయించారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న నాయీబ్రాహ్మణులను ప్రభుత్వ ఆదుకోవాలని కోరారు. సంఘం అభివృద్ధికి సభ్యుల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సంఘం అధ్యక్షుడు కందికుప్ప గోవిందు, మాజీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నూకరాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు నరవ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న గోపాలపట్నం పైడిమాంబ నాయీ బ్రహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం

మున్సిపల్ కార్మికుల ధర్నాలపై ప్రచారం

గాజువాక: గతంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 17నుంచి చేపట్టనున్న ధర్నాలపై జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లోని మస్టర్ పాయింట్ల వద్ద యూనియన్ నాయకులు మంగళవారం కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ధర్నాలను జయప్రదం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. గాజువాక జోనల్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు పనిముట్లు పంపిణీ, సేఫ్టీ పరికరాలు, మిస్సింగ్ జీతాలు, డైలీ వేజ్ కార్మికులకు బకాయి వేతల చెల్లించాలన్న డిమాండ్లతో ఆందోళన నిర్వహించనున్నామని యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, గొలగాని అప్పారావు తదితరులు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

రైల్వే ప్రైవేటీకరణ తగదు

దాబాగార్డెన్స్: రైల్వే ప్రైవేటీకరణ యోచనను విడనాడాలని, భద్రతా ప్రమాణాలు చేపట్టాలని కోరుతూ ఈ నెల 19న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిటు కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, పలువురు నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ సదస్సుకు ముఖ్య వక్తగా సిటు అఖిల భారత అధ్యక్షురాలు కె. హేమలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రైల్వే యూనియన్ నాయకులు ఉమామహేశ్వరరావు, ఇతర ఫెడరేషన్ నాయకులు హాజరవుతారని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదైన రైల్వేలను పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం ప్రైవేటీకరించే విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ వల్ల నాణ్యత తగ్గిపోతుందన్నారు. సదస్సులో పెద్ద ఎత్తున ఉద్యోగులు, కార్మిక సంఘాలు పాల్గొనాలని కోరారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

రౌడీషీట్ తెరవనున్నట్టు ఏసీపీ త్రినాథ్ వెల్లడి

అక్కిరెడ్డిపాలెం: దొంగ అనే అనుమానంతో అకారణంగా వ్యక్తిపై భౌతిక దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ముగ్గురిని గాజువాక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారిపై రౌడీషీట్ తెరవనున్నట్టు సౌత్ ఏసీపీ త్రినాథ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. గుర్తు తెలియని వ్యక్తి వాంబేకాలనీలో సోమవారం రాత్రి సమయంలో ఒక దగ్గర మంచినీరు తాగుతున్నాడు. ఆ సమయంలో కాలనీకి చెందిన ఏ.వెంకటరమణ, జి.వెంకటరమణ, జి.హేమంత్ గుర్తు తెలియని వ్యక్తిని పలు ప్రశ్నలు వేశారు. ఆ వ్యక్తికి మాటలు సరిగ్గా రాకపోవడంతో ముగ్గురు అతన్ని దొంగగా భావించి విచక్షణా రహితంగా కొట్టారు. తీవ్ర గాయాలతో ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో ఆ వ్యక్తి చనిపోయాడని భయపడి దాడి చేసిన వారిలో ఎ.వెంకటరమణ అనే వ్యక్తి గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న సీఐ పార్థసారథి సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తిని కొట్టడానికి గల కారణాలను సేకరించారు. కాలనీకు చెందిన ముగ్గురు అకారణంగా కొట్టారని గుర్తించి అరెస్ట్ చేశామని ఏసీపీ త్రినాథ్ తెలిపారు.

అనూష భర్తను కఠినంగా శిక్షించాలి

ఏపీ మహిళా సమాఖ్య డిమాండ్



కేజీహెచ్ మార్చురీ వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మహారాణిపేట: మధురవాడకు చెందిన నిండు గర్భిణి అనూషను కడతేర్చిన భర్తను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల డిమాండ్ చేశారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విమల మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. హోమ్ మంత్రి అనిత ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణమని, సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కె.వనజాక్షి, కార్యదర్శి ఎం.డి బేగం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు అంబేడ్కర్



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఆర్ఎంపీ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగం జనరల్ మేనేజర్ ఎస్.రవి, డీజీఎంలు వై. బాలకోటయ్య, నాయక్, సమధర్, ఎస్. దేవానంద్, సుబ్రమణ్యం, అమరాన్, ఆర్‌ఈడీ ఇన్‌చార్జి తేజ, డీజీఎంలు కిన్నెర మేఘన, ధనంజయ్, జె. కాళిదాస్‌లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎం రవి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారన్నారు. ఆయన దూరదృష్టితో రాసిన రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. అలాంటి దార్శనికుడి ఆశయ సాధన కోసం కృషి చేయడం ఆయనకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఎస్. రమేష్‌కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాల అప్పలరెడ్డి, శశిరెడ్డి, పి. సోమునాయుడు, పి. అప్పారావు, కె. తావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ రాయితీ వర్తింపజేయాలి



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, దళితులు

కంచరపాలెం: ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రాయితీ వర్తింపచేయాలని కంచరపాలెం సీపీఎం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జోన్–2 కంచరపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ జీవీఎంసీ 56వ వార్డు దయానందనగర్, ముత్యమాంబకాలనీ, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ, పైడిమాంబకాలనీ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సుమారు 200 వరకు ఉన్నాయని, వారికి 200 యూనిట్లలోపు వాడిన కరెంటుకు ఉచిత రాయితీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి సౌకర్యాలు లేకపోవడంతో వారంతా షాపుల్లో పనులు, బిల్డింగ్ పెయింటింగ్ పనులు చేస్తున్నారన్నారు. దళితులకు ఉపాధి సౌకర్యాలు అందడం లేదని, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఏఈకి కరెంటు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సానబోయిన సోమేశ్వరరావు, ఎం.ఈశ్వరరావు, కె.కుమారి, పి.శారద, జె.వెంకటేష్, ఎల్.రామయ్య, కె.లక్ష్మి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి అంబేడ్కర్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మల్కాపురం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని మల్కాపురం సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం అంబేడ్కర్ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఆమె తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు.ఆమె మాట్లాడుతూ సంఘసంస్కర్తగా,ఆర్థికవేత్తగా,రాజ్యాంగ నిర్మాతగా డాక్టర్ అంబేడ్కర్ సేవలు ఆదర్శప్రాయం అని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బి.ఆర్. అంబేడ్కర్ అందరివాడు అని,ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.కార్యక్రమంలో మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాస్లిన్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు బి.పి.రాజు, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. చెరువుల్లా మారిన రోడ్లు



మల్కాపురం సేవా మార్గంలో నిలిచిపోయిన వర్షపు నీరు



రోడ్డుపై నిలిచిన వ్యర్థాలు

మల్కాపురం: అకాల వర్షం కారణంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు సేవా మార్గాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కొన్ని చోట్ల కాలువలు పొంగి ప్రవహించడంతో వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. మంగళవారం మధ్యాహ్నం పారిశ్రామిక ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. అంత వరకు ఎండ తీవ్రంగా ఉన్నా అప్పటికప్పుడే నల్లటి మబ్బులు వేసి ఒక్కసారిగా వర్షం జోరుగా కురవడంతో మల్కాపురం,ఆర్‌కేపురం,శ్రీహరిపురం వంటి సేవా మార్గాల్లో వర్షపు నీరు నిలిచింది. కాలువలు పొంగడంతో మురుగు, వ్యర్థాలు రోడ్లపైకి వచ్చాయి. ఆ సమయంలో అటువైపు వచ్చిన పలువురు వాహనదారులు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

క్షయ రోగులకు వైద్య సేవలపై ఆరా

అగనంపూడి: క్షయవ్యాధి గ్రస్తులకు అగనంపూడి ఆస్పత్రిలో అందుతున్న సేవలు, మందుల పనితీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెన్సీ బృందం మంగళవారం పరిశీలించింది. టీబీ రోగుల వివరాలు, వారికి అందుతున్న సేవలు, రికార్డులు, వారికి చేస్తున్న పరీక్షల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడి సకాలంలో మందులు అందుతున్నాయా, మందుల ప్రభావం ఎలా ఉంది, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు పని చేస్తున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా వైద్యసేవలు ఎలా పొందాలి, మందులు ఎలా తీసుకోవాలి అనే అంశాలపై రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెన్సీ బృంద ప్రతినిధులు డాక్టర్ వసుంధర, జయసాయి, శ్లోగ్యాశ్రీ, అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి. ఉష, క్షయవ్యాధి నిపుణురాలు డాక్టర్ ప్రత్యూష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, ఐసీటీసీ కౌన్సిలర్లు రవికుమార్, కళావతి పాల్గొన్నారు.



టీబీ రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెన్సీ బృందం

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

సీపీ శంఖబ్రత బాగ్చి

ఉక్కునగరం: నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌ను మొత్తం నిశితంగా పరిశీలించారు. పరిసర ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. టౌన్‌షిప్‌లో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు మరిన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను గమనించాలన్నారు. స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా ఉండరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పెండింగ్ వాహనాలను పరిశీలించి వాటి డిస్పోజల్‌కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫైళ్లను పరిశీలించి పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలని, అన్ని రికార్డులు అప్‌డేట్‌గా ఉండేలా చూడాలని ఆదేశించారు.



స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి